

డ్వామాలో డ్రామాలు..!

బదిలీ అధికారికి భజనే భజన

బంగారు కడియం తొడగాలని ప్లాన్

సోషల్ మీడియాకు చేరడంతో మౌనం

బదిలీ అయినా విధుల్లో చేరని ఏపీఓలు



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18: డ్వామా వింత పోకడలకు వేదికగా మారింది. బదిలీ అయిన పీడీకి బంగారు కడియం, ఖరీదైన ఉంగరాన్ని బహూక రించి.. ఘనంగా సాగనంపాలని భావించారు. ఈ వ్యవ హారం బయటకు పొక్కి.. సోషల్ మీడియాకు ఎక్కడంతో వ్యూహం మార్చి.. హంగూ ఆర్భాటం లేకుండా సన్మానం చేశారు. కలెక్టర్ సీరియస్ కావడంతో బదిలీ అయిన పీడీ వెంటనే రిలీవ్ అయ్యారు. అమరావతికి వెళ్లి మాతృశా ఖకు రిపోర్ట్ చేసుకున్నారు. డ్వామాలో కీలకంగా ఉండే హెచ్‌ఆర్, విజిలెన్స్ విభాగం అధికారులు సెలవులో వెళ్లారు. పీడీ సన్మానసభకు మాత్రం హాజరయ్యారు. నెల రోజుల క్రితం ఎనిమిది మంది ఏపీఓలను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కొందరు కేటా యించిన మండలాల్లో విధుల్లో చేరారు. కంబదూరుకు బదిలీ అయిన సుజాత మాత్రం విధుల్లో చేరలేదు. పైగా బుక్కరాయసముద్రం మండలంలో పనిచేస్తున్నట్లు డ్యూటీ సర్టిఫికెట్ సృష్టించారు. పెద్దవడుగూరు ఏపీఓ ఫుల్లారెడ్డి అక్కడ విధుల్లో లేకపోయినా.. బదిలీ అయిన పీడీ ద్వారా అక్కడే ఉన్నట్లు అందరినీ నమ్మించారు. అక్కడే జీతం తీసుకున్నారు. ఇలాంటివి డ్వామాలో సర్వ సాధారణమయ్యాయి. వైసీపీ పాలనలో డ్వామాను ఏలి నవారికే తిరిగి ప్రాధాన్య స్థానాలను అప్పగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

సెలవులో హెచ్‌ఆర్ మేనేజర్

ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో పది రోజులుగా హెచ్‌ఆర్ మేనేజర్ గీత సెలవులో ఉన్నారు. ఇదే విభాగంలో పనిచే స్తున్న ఓ కంప్యూటర్ ఆపరేటర్ శాఖనే శాసించే స్థాయికి చేరాడు. ఉద్యోగుల బదిలీల పేరిట రూ.లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో డ్వామాలో కీలకంగా ఉండే విజిలెన్స్ విభాగం అధికారి రెండు నెలలుగా సెలవులో ఉన్నారు. ఆ అధికారి అదే స్థానం కోసం, డీపీఓ పోస్టుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

వైసీపీ హయాంలో హవా నడిపిన ఓ ఏపీఓ ధర్మవరం క్లస్టర్ ఏపీడీగా పనిచేశారు. తిరిగి ఏపీడీ పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం తాడిపత్రి క్లస్టర్ పరిధిలోని పెద్దవడుగూరులో పనిచేస్తూ, భజన బృందంలో కీలకంగా ఉన్నారు. పీడీకి ఘన సన్మానం చేయాలనే అంశంలో కీలకపాత్ర పోషించారు. అనంత పురం క్లస్టర్‌తో పాటు గుంతకల్లు నియోజకవర్గంలోని ఓ క్లస్టర్ ఏపీడీ, పీడీ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు తమ స్థానాలు పదిలం చేసుకోవడం కోసం 'భజన' గీతాలు పాడుతున్నారు.

ఇన్‌చార్జి పీడీగా విజయలక్ష్మి



పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయలక్ష్మి

డ్వామా ఇన్‌చార్జి పీడీగా విజయలక్ష్మి నియమితుల య్యారు. ఏటీగా పని చేస్తున్న విజయల క్ష్మికి ఎఫ్ఏసీ బాధ్య తలు అప్పగిస్తూ కలె క్టర్ డాక్టర్ వినోద్‌కు మార్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరే ట్‌లో కలెక్టర్‌ను ఆమె బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజే శారు. అనంతరం డ్వామా కార్యాలయంలో పీడీగా బాధ్యతలు స్వీకరిం చారు. ఆమెను పలువురు అధికారులు, సిబ్బంది అభినం దించారు. కలెక్టర్ నిర్ణయంతో ఆశావహులు షాక్ తిన్నారు. డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఉపాధి హామీపథకం సూపరింటెండెంట్ శైలజ, జిల్లా గిరిజన సంక్షే మశాఖ అధికారి రామాంజినేయులు, వ్యవసాయ శాఖ ఏడీ అల్తాఫ్‌తో పాటు పలువురు ఇన్‌చార్జి పీడీ పోస్టు కోసం తీవ్రప్రయత్నాలు చేశారు. రెగ్యులర్ పోస్టు కోసం ఆశావహులు ప్రయత్నాలను మరింత తీవ్రం చేశారు.

ఖరీదైన ప్రేమ

బదిలీపై వెళ్ళిన పీడీపై డ్వామాలో కొందరు ఉద్యోగులు ఖరీదైన ప్రేమను చాటుకోబోయారు. భజన బృందంగా ఏర్పడి.. పీడీకి బంగారు కడియం తొడగాలని, ఘనంగా వీడ్కోలు పలకాలని హంగు ఆర్భాటాలతో ఏర్పాట్లు చేశారు. పీడీని బదిలీ చేయడంతోపాటు వెంటనే రిలీవ్ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వెంటనే ఆదేశాలను అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కానీ 17వ తేదీ వరకు గడువు కావాలని పీడీ కోరారు. ఈ లోగా భజనబృందం వసూ ళ్లను ప్రారంభించింది. ఒక్కో ఉద్యోగి నుంచి రూ.5 వేలు.. రూ.10 వేలు వసూలు చేసింది. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా బయటకు పొక్కడంతో పీడీ అప్రమత్తమై.. వెంటనే రిలీవ్ అయ్యారు. అమరావతికి బయలుదేరి వెళ్ళారు. వ్యవహారం చెడిపోవడంతో ఉద్యోగుల నుంచి వసూలు చేసి డబ్బులను వెనక్కు ఇచ్చేసినట్లు సమాచారం. బదిలీ అయిన పీడీ ద్వారా పలు పనులకు సంబంధించిన ఫైళ్లపై పాత తేదీలతో సంతకాలు చేయించారని ప్రచారం జరుగుతోంది. ఇదంతా భజనబృందం పనే అని ఆ శాఖలో చర్చ జరుగుతోంది.

అక్రమాలపై ఆర్జేడీ విచారణ

అనంతపురం విద్య, సెప్టెంబరు 18: జిల్లా విద్యాశాఖలోని డీసీ ఈబీలోని అక్రమాలపై పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ విచారణకు దిగినట్లు తెలుస్తోంది. డీసీఈబీలో నిధుల స్కాంపై ఇప్పటికే కలె క్టర్ విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో డీసీఈబీ అక్రమాలు ఆర్‌జేడీ శామ్యూల్ దృష్టికి వెళ్లడంతో ఆయన సైతం విచారణకు దిగినట్లు తెలిసింది. డీసీఈబీలో నిధుల స్కాం, ఇతర అడ్డగోలు వ్యవహారాలపై ఆయన ఆరా తీస్తున్నారని, విచారణకు ఆదేశించా రని సమాచారం. చిత్తూరు డీఈఓ ఆఫీస్ అధికారులకు విచారణ బాధ్యతలను అప్పగించారని తెలిసింది. కలెక్టర్, ఆర్జేడీ విచారణలు లోతుగా సాగితే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశం ఉంది.

ఆర్మీ ఉద్యోగి ఐడీ మార్ఫింగ్


నలుగురిపై కేసు నమోదు

యాడికి, సెప్టెంబరు 18: టోల్ గేట్ రుసుము తప్పించుకునేం దుకు ఆర్మీ ఉద్యోగి గుర్తింపుకార్డును కొందరు మార్ఫింగ్ చేశారు. దీంతో పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన నరేష్ ఆర్మీలో పని చేస్తు న్నారు. ఆయన అసోంలో విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామానికి వచ్చిన సమయంలో వ్యక్తిగత అవసరాల నిమిత్తం రాయలచెరువు లోని ఒక నెట్‌సెంటర్‌లో తన గుర్తింపుకార్డును జిరాక్స్ చేయిం చాడు. అదే సమయంలో నెట్‌సెంటర్ నిర్వాహకుడు ఆర్మీ ఉద్యోగి గుర్తింపు కార్డును కాపీ చేసుకున్నాడు. మార్ఫింగ్ చేసి తన పేరిట ఐడీ కార్డు తయారుచేసుకున్నాడు. ఇదే తరహాలో మరో ముగ్గురు వ్యక్తులు ఫొటోలను మార్ఫింగ్ చేసుకొని ఐడీలను తయారు చేసు కున్నారు. వాహనాల్లో ప్రయాణించే సమయంలో తాము ఆర్మీ ఉద్యోగులమని నకిలీ కార్డులతో టోల్‌గేట్లను ఉచితంగా దాటేస్తు న్నారు. ఈ విషయం ఆర్మీ ఉద్యోగి నరేష్ దృష్టికి వెళ్లడంతో ఆధారా లతో ఫిర్యాదు చేశారని సీఐ ఈరన్న తెలిపారు. దీంతో రాయలచెరు వుకు చెందిన సంతోష్, వెంకటేష్, శ్రీనివాసులు, వెంకటసాగర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

నేడు అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవం

అనంతపురం అర్బన్: నగరంలోని మూడు అన్న క్యాంటీన్లను గురువారం ప్రారంభిస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వ రప్రసాద్ తెలిపారు. పాతూరు గుత్తి రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను గురువారం సాయంత్రం 6.30 గంటలకు తొలుత ప్రారంభిస్తా మని తెలిపారు. ఆ తర్వాత రైల్వే స్టేషన్, బళ్లారి బైపాస్‌లోని అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామని అన్నారు. పట్టణ పేదల ఆకలి తీర్చే డమే అన్న క్యాంటీన్ ఉద్దేశమని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో లోకోపైలెట్ మృతి



గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 18: పట్టణ శివారులో బైక్ అదుపుతప్పి కాలువలో పడి లోకో పైలెట్ షేక్ మహమ్మద్ రఫి(38) మృతి చెందారని కసాపురం ఎస్‌ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. ఇంద్రా నగర్‌కు చెందిన రఫీ గుత్తిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇంటి నుంచి మంగళవారం రాత్రి బయటకు వెళ్లి ప్రమాదానికి గురయ్యారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఆఫ్రీన్, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఏమీ మారలేదు..!

జోరుగా మట్కా.. పేకాట

పోలీసుల సహకారంతోనే..?



డీఎస్పీ కార్యాలయం

తాడిపత్రి, సెప్టెంబరు 18: తాడిపత్రి ప్రాంతం మట్కా, పేకాటకు అడ్డాగా మారింది. ఇన్నాళ్లు వాట్సాప్, ఆన్‌లైన్ వేదికగా మట్కా సాగేది. కానీ ప్రస్తుతం బీటర్లు బహిరంగంగా మట్కా పట్టీలు రాస్తున్నారు. పోలీసుల సహకారంతోనే మట్కా జరు గుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. కర్నూలు, కడప జిల్లాలు తాడిపత్రి సరిహద్దులో ఉండటంతో అక్కడి జూదరులు సైతం క్యూ కడుతున్నారు. వైసీపీ హయాంలో బీటర్లను నాటి అధికార పార్టీ నాయకుల మద్దతు ఉండటంతో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినా.. పరిస్థితిలో మార్పు రాకపోవడం విమర్శ లకు తావిస్తోంది.



అప్పట్లో ఐదుగురి సస్పెన్షన్

మట్కా నిర్వాహకులతో సంబంధాలు ఉన్న కార ణంగా 2019లో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఐదుగురిపై ఉన్నతాధికారు సస్పెన్షన్ వేటు వేశారు. వీరిలో ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టే బుళ్లు ఉన్నారు. కొంతకాలం తర్వాత వీరు వేర్వేరు ప్రాంతాల్లో విధుల్లో చేరారు. ఇంత జరిగినా పోలీ సుల తీరులో మార్పు రాకపోవడం గమనార్హం. తాడి పత్రి ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. బతుకుతెరువు కోసం ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వందల సంఖ్యలో కూలీలు ఇక్కడికి వచ్చారు. చెమ టోడ్చి సంపాదించిన కూలి డబ్బులను మట్కాలో పోగొట్టుకుంటున్నారు.

పెన్నానది గట్లపై పేకాట

తాడిపత్రి పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా పెన్నానది ఒడ్డున పేకాట స్థావరాలు ఏర్పడ్డాయి. పట్టపగలే ఎక్కడబడితే అక్కడ ఆడుతున్నారు. పట్టణ శివారులోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో పేకాట ఆడేందుకు వచ్చేవారు అక్కడే మద్యం సేవిస్తున్నారు. భక్తులు ఆలయానికి వెళ్లాలంటే జంకుతున్నారు. మట్కా, పేకాటపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జనార్దన్ నాయుడు అన్నారు.



యాడికి హైస్కూల్‌లో మధ్యలోనే ఆగిపోయిన తాగునీటి కొళాయిల ఏర్పాటు పనులు ←

మూలకు చేరిన వాటర్‌ప్లాంట్ మిషన్ →



నీరు.. నిర్లక్ష్యం..!

యాడికి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో నాడు-నేడు పథకం కింద విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించే పనులను చేపట్టారు. కొళాయిలు అమర్చేందుకు వీలుగా నిర్మాణాలు చేపట్టారు. టైల్స్ కూడా అతికించారు. కానీ పైప్‌లై న్ కనెక్షన్ ఇవ్వలేదు. రెండేళ్ల నుంచి పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. పాఠశాలకు అందజే సిన మినరల్ వాటర్ ప్లాంట్ యంత్రాలు చెడిపో యాయి. చిన్న, చిన్న మరమ్మతులు చేస్తే ఉప యోగించుకోవచ్చు. కానీ మూలనపడేశారు. లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతు న్నారు. అధికారులు స్పందించి, తాగునీటి పథ కాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యా ర్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

- యాడికి

నీటి కోసం పోరాటం



రోడ్డుపై బైఠాయించిన సీపీఐ నాయకులు, రైతులు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 18: హెచ్చెల్సీ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మండ లంలోని పలు గ్రామాల రైతులు బుధవారం రాస్తా రోకో చేపట్టారు. రబీసీజ న్ ప్రారంభమై చాలా రోజులైనా ఆయకట్టుకు నీరు విడుదల చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. పురుగుల మందు డబ్బాలు పట్టుకుని తాడిపత్రి రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకుని సీఐ కరణాకర్, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. రైతులు పోలీసులుతో వాగ్వాదానికి దిగారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటను పూర్తిగా నష్టపోయామని అన్నారు. రబీలో పంటల సాగుకు ఇప్పటి వరకు నీరు విడుదల చేయలేదని వాపోయారు. వర్షాభావంతో బోర్లలో నీరు రావడం లేదని, సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతవరకూ ఆందోళన కొనసాగిస్తామని భీష్మించారు. దీంతో ఆందోళన చేస్తున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామిని, పలువురు రైతులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

అన్నదాత.. నేత్రదాత

అప్పుల బాధతో రైతు బలవన్మరణం
కళ్లను దానం చేసిన కుటుంబ సభ్యులు



కుళ్లాయప్ప (ఫైల్), మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య నారాయణమ్మ

నార్పల, సెప్టెంబరు 18: సేద్యాన్ని నమ్ముకుని అప్పులపాలయ్యాడు. దిక్కుతోచక జీవితాన్ని అర్థాంత రంగా ముగించాడు. ఇన్నాళ్లు మట్టితో పోరాడి పంటలు పండించిన అన్నదాత.. ఆత్మహత్య తరువాత కూడా తన త్యాగాన్ని కొనసాగించాడు. పోతూ పోతూ ఇద్దరికి కంటి చూపు ప్రసాదించాడు. నార్పల మండ లంలోని బి.పప్పూరు గ్రామ రైతు కుళ్లాయప్ప(45) అప్పులబాధతో మంగళవారం రాత్రి ఉరివేసుకున్నాడు. కుళ్లాయప్పకు రెండు ఎకరాల పొలం ఉంది. మిరప, టమోటా, అరటి సాగు చేసి నాలుగేళ్లుగా నష్టపో యాడు. అప్పులు రూ.8 లక్షలకు పైగా పేరుకుపో యాయి. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకు న్నాడు. కుళ్లాయప్పకు భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఆయన కళ్లను కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ మెమోరియల్ ట్రస్టుకు దానం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాగర్ తెలిపారు.



కళ్లు దానం చేసినందుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎల్వీ ట్రస్టు సభ్యులు

కరెంట్ షాక్ కొట్టి..

బావిలో పడి..

కౌలు రైతు మృతి



నరసింహులు (ఫైల్)

ఉరవకొండ, సెప్టెంబరు 18: పెన్నహోబిలం సమీపంలో విద్యుదాఘాతంతో కౌలు రైతు నరసింహులు(47) మృతి చెందారు. మోపిడి గ్రామానికి చెందిన నరసింహులు పెన్నహోబిలం సమీపంలో మూడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వేరుశనగ పంటను సాగుచేశాడు. పొలానికి తడి ఇచ్చేందుకు మోటారును ఆన్ చేయబోయాడు. స్టార్టర్‌ను తాకగానే విద్యుదాఘాతానికి గురై.. పక్కనే ఉన్న బావిలో పడ్డాడు. పొరుగు రైతులు గమనించి నరసింహులును బావి నుంచి బయటకు తీసుకొచ్చారు. చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిదిమేసి చేతిలో పెట్టారు..!

పసివాడి ప్రాణం తీసిన ప్రైవేటు వైద్యం

- పదిరోజులపాటు జ్వరానికి ఉత్తుత్తి వైద్యం
- కర్నూలుకు తరలిస్తుండగా అంబులెన్స్‌లో ఆక్సిజన్ ఖాళీ
- బయటికి చెబితే అంతు చూస్తామని తల్లిదండ్రులకు బెదిరింపు
- గుంతకల్లులో దారుణం..
- ఆస్పత్రి వద్ద బాధితుల ఆందోళన



మృతిచెందిన ఇంతియాజ్ (ఇన్‌సెట్‌లో ఫైల్)

అమ్మ కడుపు నుంచి బయటికొచ్చి ఏడాది..! ఇంటిల్లిపాదీ అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు. పది రోజుల క్రితం జ్వరం రావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. రోజులు గడుస్తున్నా బిడ్డ పరిస్థితి మెరుగుప డలేదు. 'బెంగళూరుకో, కర్నూలుకో పోతాం.. రాసివ్వండి సార్..' అని డాక్టర్‌ను అడిగితే.. 'అంతా మీ ఇష్టమేనా..? ఇక్కడే బాగవుతుందిలే..' అని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఏమీ అనలేకపోయారు. ఇంకో రెండు రోజులు గడిచాక.. పరిస్థితి విషమించింది. 'అంబులెన్స్ మాట్లాడుతా..! అందులో ఆక్సిజన్ ఉంటుంది. పెట్టుకోని వెంటనే కర్నూలుకు వెళ్లండి..' అని డాక్టరుగారు చావు కబురు చల్లగా చెప్పారు. ఆయన చెప్పిన అంబులెన్సులో హడావుడిగా బయలుదే రారు. సగం దూరం కూడా వెళ్లలేదు..! అంబులెన్స్‌లో ఆక్సిజన్ అయి పోయింది. బిడ్డలో కదలికలు లేవు..! ఒకప్పుడు వైద్యులను సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడితో పోల్చేవారు. ఇప్పుడు యమధర్మరాజు కూడా వైద్యుడి అవతారం ఎత్తాడు అనుకోవాలా..? బిడ్డపోయిన బాధలో తల్లిదండ్రులు ఉంటే.. 'ఆక్సిజన్ అయిపోయినందుకే బిడ్డ చనిపోయి నట్లు గొడవ చేశారో..' అని అంబులెన్స్ నిర్వాహకుడు బెదిరించాడట..! యమకింకరుడికి ఏమాత్రం తీసిపోకుండా..! ఇంత జరిగితే.. బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని, ఇంకోసారి ఇలా జరకుండా చూడాలని కోరాల్సిన నాయకులు కొందరు.. ఆస్పత్రి వద్దకు వెళ్లి సెటిల్మెంట్ చేశారు. ఆ దుప్పటి పంచాయితీకి ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.

- గుంతకల్లు టౌన్



ఆక్సిజన్ అందక మృతి చెందినట్లు వైద్యుడిచ్చిన సర్టిఫికెట్‌ను చూపుతున్న బాలుడి తండ్రి

గుంతకల్లు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన షఫి, జాస్మీన్ దంపతుల కుమారుడు ఇంతియాజ్‌కు పది రోజుల క్రితం జ్వరం వచ్చింది. పట్టణంలోని ఆర్టీ గుప్త హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు. జ్వరం తగ్గకపోవడంతో రెఫర్ చేస్తే బెంగళూరు లేదా కర్నూలుకు తీసుకువెళతా మని వైద్యుడు కీర్తి కిరణ్ రెడ్డిని అడిగారు. 'నేను రెఫర్ చేస్తేనే వెళ్లాలి. అంతా మీ ఇష్టమేనా.. ఇక్కడే తగ్గిపోతుందిలే..' అని ఆయన అన్నారు. ఈ క్రమంలో బుధవారం వేకువజామున బాలుడి పరిస్థితి విషమంగా మారింది. వెంటనే కర్నూలుకు తీసుకెళ్లాలని డాక్టర్ కీర్తి కిరణ్ సూచిం చారు. 'నేను అంబులెన్స్ రెడీ చేస్తాను. అందులో ఆక్సిజన్ ఉంటుంది. ఆక్సిజన్ పెట్టుకుని కర్నూలుకు తీసుకెళ్లండి' అని సూచించారు. అంబులె న్స్‌లో బాలుడిని తీసుకుని ఉదయం 6 గంటలకు కర్నూలుకు బయలుదే రారు. ప్యాపిలి మండల కేంద్రం వద్దకు వెళ్లేలోగా అంబులెన్స్‌లో ఆక్సిజన్ అయిపోయింది. దీంతో ఊపిరి అందక బాలుడిలో కదలికలు స్తంభిం చాయి. డోన్ పట్టణానికి చేరుకుని అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చూపిం చారు. అప్పటికే బాలుడు మృతిచెందాడు. ఆక్సిజన్ అందకనందుకే తమ కుమారుడు మృతిచెందాడని అక్కడి వైద్యాధికారులు నిర్ధారించి, సర్టిఫి కెట్ ఇచ్చారని బాలుడి తండ్రి కన్నీరుమున్నీరయ్యారు. తమ కుమారుడి మృతదేహాన్ని తీసుకుని గుంతకల్లులోని ఆర్టీ గుప్త ఆసుపత్రి వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. పది రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నా సరైన వైద్యం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. డాక్టర్, అంబులె న్స్ నిర్వాహకుడి నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతిచెందా డని ఆరోపించారు. సుమారు నాలుగు గంటలపాటు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, మైనార్టీ నాయకులు, కులసంఘాల నాయకులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వైద్యుడితో మాట్లా డారు. బాలుడి కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తానని డాక్టర్ చెప్ప డంతో ఆందోళన విరమించారు. వివాదంపై డాక్టర్ స్పందించలేదు.

అంబులెన్స్ ఓనర్ బెదిరింపులు



రోదిస్తున్న బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు

మృతిచెందిన బాలుడిని అంబులెన్స్‌లో గుంతకల్లుకు తిరిగి తీసుకొస్తున్న సమయంలో అంబులెన్స్ ఓనర్ సలీం తమను బెదిరించాడని బాలుడి తల్లిదండ్రులు ఆరోపించారు. 'ఆసుపత్రి వద్దకు వెళ్లి గొడవ చేస్తే మీ సంగతి చూస్తా' అని హెచ్చరించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి వద్దకు రాగానే బాలుడి మృతదేహాన్ని కిందకు దించి, అంబులెన్స్ అద్దాలను పగులగొట్టారు. అంబులెన్సు నిర్వాహకుడు అక్కడి నుంచి ఉడాయించాడు. ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్నారని సమాచారం అందుకున్న రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి అక్కడికి వచ్చారు. డాక్టర్‌ను నిలదీసేందుకు వెళుతున్న బాలుడి బంధువులను అడ్డుకున్నారు. 'ఇంత మంది విలేకరులు ఎందుకు వచ్చారు? డాక్టర్‌తో మీరేం మాట్లాడుతారు?' అని విలేకరుపట్ల దురుసుగా వ్యవహరించారు.

మెడికల్ కళాశాలలో సంబరాలు

సీట్లు పెంచడంపై హర్షం



ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావును సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

అనంతపురంటౌన్, సెప్టెంబరు 18: ఎంబీబీఎస్ సీట్లు పెంచడంపై బుధవారం మెడికల్ కళాశాలలో సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడు ఉన్న 150 ఎంబీబీఎస్ సీట్లకు అదనంగా మరో 50 సీట్లు పెంచి ఈ విద్యా సంవత్సరం నుంచే అవకాశం కల్పిస్తూ జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో కళాశాలలో ప్రొఫెసర్లు, డాక్టర్లు, మెడికోలు సంబరాలు చేసుకున్నారు. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న కల నెరవేరడంతో ఆనందం ఉప్పొంగింది. ఇందుకు పట్టుదలగా కృషిచేసిన ప్రిన్సిపాల్ మాణిక్యాలరావును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అందరి సహకారంతో అదనంగా 50సీట్లు పెంచుకోగలిగామన్నారు. గత ఆరు నెలలుగా కష్టపడుతున్నా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, షంషాద్‌బేగం, షారోన్‌సోనియా, శ్యాంప్రసాద్, ప్రవీణ్‌దీన్‌కుమార్, పద్మ శ్రావణి, శ్రీనివాసరావు, మధుసూదన్, బసిరెడ్డి, ప్రవీణ, మల్లిక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి బదిలీ

పుట్టపర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల రిజిస్ట్రార్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారిని శ్రీకాకుళం జిల్లాకు నియమించింది. కొత్త జిల్లా ఏర్పాటు చేసినప్పట్నుంచి కృష్ణకుమారి ఇక్కడ పనిచేస్తున్నారు. జిల్లా రిజిస్ట్రార్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు.

నూతన డీఐజీగా విజయలక్ష్మి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ ఎన్.మాధవి బదిలీ అయ్యారు. మాధవిని ఏలూరు డీఐజీగా బదిలీ చేస్తూ ఆ శాఖ ఐజీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో విజయనగరం డీఐజీ పి.విజయలక్ష్మిని నియమించారు. మార్కెట్ వాల్యూ, ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా బి.శ్రీనివాసులును నియమించారు. ప్రస్తుతం కర్నూలు నోడల్ డీఆర్ నాగలింగేశ్వరరావు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు.

అత్యాచారయత్నం.. కేసు నమోదు

చిలమత్తూరు, సెప్టెంబరు 18: ఇంట్లో ఒంటరిగా ఉన్న వివాహితపై అత్యాచార యత్నం చేశాడనే ఫిర్యాదుతో ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన శివవర్ధన్ అనే యువకుడు మంగళవారం అదే గ్రామానికి చెందిన ఓ వివాహిత ఇంట్లోకి వెళ్లి అత్యాచార యత్నం చేశాడు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి వెళ్లి విచారించిన పోలీసులు యువకుడిపై ఐపీసీ 65, 75, 351, 333 సెక్షన్ల ప్రకారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాతలారా..! పుస్తకాలివ్వండి..!

- విద్యార్థుల్లో వికాసాన్ని పెంపొందించండి
- బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 18: 'దాతలారా..! ముందుకు రండి.. ప్రభుత్వ వసతి గృహాల్లో వసతి పొందుతున్న విద్యార్థుల్లో విద్యావికాసాన్ని పెంపొందించేందుకు సహకరించండి' అని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 55 బీసీ వసతిగృహాల్లో 8,288 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారన్నారు. ఆయా వసతిగృహాల్లోని విద్యార్థులకు లోకజ్ఞానం, విద్యావికాసం పెంపొందించేందుకు మినీ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. దాతలు విద్యార్థులకు ఉపయోగపడే పోటీ పరీక్షలు, నీతికథలు, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్, తెలుగు, ఇంగ్లీష్ టు తెలుగు డిక్షనరీ పుస్తకాలను విరాళంగా ఇచ్చేవారు అనంతపురం రుద్రంపేటలోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. దాతలు అందించే పుస్తకజ్ఞాన సంపద పేద విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మరిన్ని వివరాలకు బీసీ సంక్షేమశాఖాధికారి సెల్ : 9414055515ను సంప్రదించాలన్నారు.

రైల్వేలో పత్తాలేని వైఫై

- ప్లాట్‌ఫారాల్లో బోర్డులూ తొలగింపు
- ఆరు నెలలకే అటకెక్కించిన వైనం



రైల్వే వైఫై లోగో

గుంతకల్లు, సెప్టెంబరు 18: దేశ వ్యాప్తంగా రైల్వే పెద్ద స్టేషన్లలో వంద శాతం వైఫై సేవలను అందుబాటులోకి తెచ్చామంటూ చేసిన ప్రకటనలు నీటిమీది రాతలయ్యాయి. ప్రయాణికులకు ప్రయాణంలో ఉచిత వైఫై సదుపాయం కల్పించడానికి రైల్వే శాఖ చర్యలు తీసుకుంది. ఆరు నెలల కాలంలోనే రైల్ వైర్ పేరిట దేశవ్యాప్తంగా అన్ని ఏ-1, ఏ క్లాస్ స్టేషన్లలో వైఫై సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం పూర్తయిందంటూ రైల్వే శాఖ ప్రకటించింది. కానీ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో క్షేత్రస్థాయికి వచ్చేసరికి పరిస్థితి తారుమారైంది. ప్రస్తుతం ఏ స్టేషన్‌లోనూ వైఫై కనెక్ట్ కావడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఏ స్టేషన్‌లోనూ ఉచిత ఇంటర్నెట్ అందుబాటులో లేదంటున్నారు.

డివిజన్‌లో 114 స్టేషన్లకు వైఫై

దేశవ్యాప్తంగా రైళ్లలో ప్రయాణికుల ఉపయోగార్థం ఉచిత వైఫై సదుపాయాన్ని కల్పించడానికి 2018లో నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా 1 ఎంబీపీఎస్ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఉచితంగా అరగంట సేపు వినియోగించేందుకు అవకాశం కల్పించారు. తర్వాత రూ. 10 ధరతో 34 ఎంపీబీఎస్ స్పీడ్ కలిగిన 5 జీబీల డేటాను వాడుకునే వెసులుబాటు కల్పించారు. మరికొన్ని ప్యాకేజీలను ప్రకటించారు. ఈ మేరకు గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని ఏ-1, ఏ, బీ క్లాస్ రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై సౌకర్యాన్ని కల్పించినట్లు అధికారులు ప్రకటించారు. 2021 డిసెంబరులో గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని ఏ-1 క్లాస్ రైల్వే స్టేషన్ అయిన తిరుపతిలో వైఫై సదుపాయాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏ- కేటగిరి స్టేషన్లయిన గుంతకల్లు, అనంతపురం, రాయచూరు, కడప, రేణిగుంట, ధర్మవరం స్టేషన్లకు వై-ఫై సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఆరంభ ఆర్భాటం తప్ప అమలులో ఆసక్తిని కనబరచలేదు.

ఆర్నెళ్లకే అటకెక్కించారు..

ఎంతో ఆర్భాటంగా చేపట్టిన ఉచిత వైఫై పథకాన్ని ఆర్నెళ్లకే అటకెక్కించారు. డివిజనల్ కేంద్రమైన గుంతకల్లులో ఉచిత వైఫై సదుపాయం వచ్చాక వెయిటింగ్ హాళ్లలో విశ్రాంతి తీసుకునే ప్రయాణికులకు, ప్లాట్‌ఫారాలపై రైళ్ల కోసం ఎదురుచూసే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఆరు నెలలు సక్రమంగా నిర్వహించి తర్వాత వైఫైని ఆన్ చేయడం మానేశారు. మూడేళ్లుగా ఉచిత వైఫై పనిచేయడం లేదు. పక్కనున్న రైల్వే డివిజన్లలో ఉచిత వైఫై సదుపాయం కొనసాగుతుండగా గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ఈ పథకాన్ని నీరుగార్చారు. రైల్వే స్టేషన్‌లో వైఫైకి సంబంధించిన వ్యవస్థ అలాగే ఉన్నా వినియోగించడం లేదు. ప్లాట్‌ఫారాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైఫై బోర్డులను అధికారులు తొలగించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులను ప్రశ్నించినా తగిన సమాధానం ఇవ్వలేదు. అరగంట ఉచిత ఇంటర్నెట్ వినియోగించిన తర్వాత ప్రయాణికులు పెయిడ్ ప్యాకేజీలను రీచార్జ్ చేయకపోవడమే కారణంగా కనిపిస్తోంది.

చివరికి నష్టమేనా..?



నీరులేక ఎండిపోతున్న వరి పొలం



కాలువలో అడ్డంగా పడిన జంబు మొక్కలు

పంటలు ప్రశ్నార్థకం

- జీబీసీ పిల్ల కాలువలకు అందని సాగు నీరు
- ఎండిపోతున్న వరి, మిర్చి, కంది పంటలు
- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు
- నేడు ఐఏబీ సమావేశం.. న్యాయం జరిగేనా..?

విడపనకల్లు, సెప్టెంబరు 18: గుంతకల్లు బ్రాంచ్ కాలువకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందక ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో సాగు చేసిన మిర్చి, వరి పైర్లకు సాగు నీరు అందక పొలాలు నెర్రెలుబారి ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇంకో 10 రోజులు నీరు రాకపోతే పంటలపై ఆశలు వదులుకోవాల్సిందే. ఎండుతున్న పంటలను చూసి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. జీబీసీకి పూర్తి స్థాయిలో సాగునీరు రాక పోవటమే ఇందుకు కారణం. జీబీసీ ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉరవకొండ నియోజక వర్గంలో 25 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. 3వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 9వ డిస్ట్రిబ్యూటరీ వరకూ నీరు పారటంలేదు. 6, 7, 8, 8ఆర్, 8ఏ, 9వ డిస్ట్రిబ్యూటరీల కింద దాదాపుగా 9వేల ఎకరాల్లో మిర్చి, కంది, వరి పంటలు సాగు చేశారు. 6,7వ కాలువలకు కొద్దిగా నీరు అందుతున్నా కిందికి వెళ్లటంలేదు. 8, 8ఆర్, 8ఏ, 9వ కాలువలకు చుక్క కూడా నీరు అందటంలేదు. దీంతో రెండు నెలలుగా సాగు చేసిన పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయి. ట్రాక్టర్లను ఉపయోగించుకుని వరి పొలాలకు నీటిని కడుతున్నారు.

చివరి ఆయకట్టుకు అందని నీరు

జీరో బై జీరో వద్ద గత సంవత్సరం వర్షాలకు హెచ్ఎల్‌సీ కోతకు గురైంది. జీబీసీ దాదాపుగా మూడున్నర అడుగుల మేరకు మట్టితో పూడుకుపోయింది. గత వైసీపీ ప్రభుత్వం పూడిక తీత పనులు చేయించి ఉంటే ప్రస్తుతం నీరు ముందుకు సాగేది. హెడ్ వద్ద 8.5 అడుగులు రావాల్సిన చోట 6.3 అడుగుల నీరు మాత్రమే వస్తోంది. దీనికి తోడు అక్విడెట్ల వద్ద లీకేజీలు, నాన్ ఆయకట్టు రైతులు అడుగడుగునా నాలుగు ఇంచుల మోటార్లు పెట్టి జల చౌర్యం చేస్తుండడంతో సమస్య మరింత జటిలమయింది. కొంత మంది నాన్ ఆయకట్టు దారులు జీబీసీ నుంచి దాదాపుగా ఒకటి, రెండు కిలోమీటర్ల పొడవు పైపులైన్లు వేసి నీటిని లాగేస్తున్నారు. ఇక కాలువలు కింద సాగు చేసే ఆయకట్టు రైతులకు సాగు నీరు ఏవిధంగా వస్తుందని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఐఏబీ సమావేశంలో న్యాయం జరిగేనా?

అనంతపురంలో గురువారం జరిగే ఐఏబీ సమావేశంలో జీబీసీ కాలువ కింద పంటలు సాగు చేసిన రైతులకు సాగు నీరు అందించేందుకు నిర్ణయం తీసుకుంటారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గంలో దాదాపుగా నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. అధికారులతో చర్చించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తారని రైతులు ఆశిస్తున్నారు.

పంట ఎండిపోతోంది..



నేను, మా అన్నదమ్ములు ముగ్గురం కలిసి బొమ్మనహాళ్ మండలం నుంచి వచ్చి విడపనకల్లు మండలంలోని జీబీసీ కింద ఒక్కొక్కరు 15 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. 8ఆర్ కాలువ కింద వరి పంటను సాగు చేశాం. వరి నాట్లు వేసి నెల రోజులు దాటి పోయింది. పిలకలు వచ్చే సమయంలో కాలువకు చుక్క నీరు రాక నేల మొత్తం నెర్రెలు చీలి పంట ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ఇంకో పది రోజుల్లో నీరు రాక పోతే సుమారు రూ. 7లక్షలు నష్టపోతాను.

- హనుమంతరాయుడు, కౌలు రైతు, గౌనూరు

చుక్క నీరు రాలేదు..



నేను జీబీసీ కింద డొనేకల్లు దారికి 8 ఎకరాల్లో మిర్చి, ఆర్.కొట్టాల దారిలో 12 ఎకరాల్లో వరి సాగు చేశాను. నెలన్నర అయినా చివరి ఆయకట్టుకు చుక్కనీరు రావటంలేదు అప్పుడప్పుడు వర్షాలు రావటంతో కొంత వరకూ పంటలు మిగిలాయి. ఇప్పుడు ఆ వర్షాలు కూడా రాలేదు. జీబీసీకి నీరు రావటంలేదు. వరి పొలం మొత్తం చీలికలు మారి ఎండిపోతోంది. కనీసం పిల్ల కాలువలకు పూర్తిస్థాయిలో నీరు వస్తే తప్ప పంటలను కాపాడుకోలేం. నీళ్లు రాకపోతే సుమారు రూ.10లక్షలు పెట్టుబడి నష్టపోవాల్సి వస్తుంది.

- ఎర్రిస్వామి, విడపనకల్లు

అప్పులు చేసి పెట్టుబడి పెట్టా



నేను అప్పులు చేసి రెండు ఎకరాల్లో వరి, మరో రెండు ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. జీబీసీకి చుక్కనీరు రావటంలేదు. పంటలు పూర్తిగా ఎండిపోయేటట్లు ఉన్నాయి. చివరి ఆయకట్టు రైతులకంటే నాన్ ఆయకట్టు రైతులకే మంచి రోజులు ఉన్నాయి. నాన్‌ఆయకట్టు రైతులు మోటార్లు పెట్టి సాగునీటిని వాడుకోవటంతో కింద ఉన్న ఆయకట్టు రైతులకు నీరు రావటంలేదు. ఇంకో వారం రోజుల్లో నీరు రాకపోతే పంటలు మొత్తం ఎండిపోయి నష్టాలు పాలు కావాల్సిందే.

- ఏసీ వన్నూరుస్వామి, ఆర్. కొట్టాల

రైతులకు న్యాయం చేస్తాం..



అనంతపురంలో గురువారం జరిగే ఐఏబీ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో చర్చించి కాలువలో పూడిక తీయించి, పిచ్చిమొక్కలు తొలగించే పనులు చేడుతాం. కాలువకు పూర్తి స్థాయిలో 350 క్యూసెక్కుల నీటిని ఇచ్చే ఏర్పాటు చేస్తాం. పూడిక తీయకపోవటం వల్ల సాగు నీరు ముందుకు వెళ్లలేక పోతోంది. నాన్ ఆయకట్టు రైతులు నీటిని వాడుకోవటం, అక్కడక్కడ లీకేజీలు ఉండటం కొంత సమస్యగా ఉంది. వాటిని అన్నిటిని అధిగమించి చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందించే బాధ్యతను తీసుకుంటాం.

- వెంకటరమణ, ఈఈ

నేడు ఐఏబీ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18: ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు (ఐఏబీ) సమావేశం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో గురువారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఐఏబీ చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్, కన్వీనర్ హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. హంద్రీ నీవా, మైనర్ ఇరిగేషన్‌తో పాటు హెచ్చెల్సీకి కేటాయించిన నీటి విడుదల తేదీలను ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాలతో పాటు అనంతపురం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి దులీప్‌ట్రోఫీ చివరి పోటీలు

- ప్రత్యేక ఆకర్షణగా సూర్యకుమార్
- పాసుల జారీలో అదే గందరగోళం
- ఆందోళనలో క్రికెట్ అభిమానులు
- కొరవడిన సమన్వయం
- ప్రాక్టీస్ చేసిన ప్లేయర్లు





బ్యాటింగ్ ప్రాక్టీసుకు వెళుతున్న సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18: చివరి విడత దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో మూడో రౌండ్ పోటీలకు క్రీడాకారులు సిద్ధమయ్యారు. మొదటి రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న భారత క్రికెట్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ మూడో విడత పోటీలకు ఇండియా-బి జట్టుకు చేరారు. గురువారం ఇండియా-డి జట్టుతో జరిగే మ్యాచ్‌కు సర్ఫరాజ్‌ఖాన్ స్థానంలో సూర్యకుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తుండడం అభిమానులకు పండుగలా మారింది. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న సూర్యకుమార్ యాదవ్‌పైనే అందరి దృష్టి పడింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇండియా ఎ, బి, సి, డి జట్ల ప్లేయర్లు అనంతపురం క్రికెట్ గ్రౌండ్ 1, 2తో పాటు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశారు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్, ఫీల్డింగ్‌లో ముమ్మర సాధన చేశారు. బీసీసీఐ క్యురేటర్ సమందర్‌సింగ్ పిచ్‌లను తయారు చేశారు. మొదటి విడతలో బౌలింగ్, రెండో విడతలో బౌలింగ్, బ్యాటింగ్‌కు పిచ్ అనుకూలించింది. మూడో విడత మ్యాచ్‌లకు పిచ్ ఏ స్థాయిలో అనుకూలిస్తుందో వేచి చూడాలి.

పాసుల జారీలో అదే గందరగోళం

దులీప్‌ట్రోఫీ మూడో విడతకు సంబంధించి పాసుల జారీపై నిర్వాహకులు స్పష్టత ఇవ్వలేదు. మొదటి మ్యాచ్‌కు జరిగిన గందరగోళమే చివరి విడత పోటీలకు కొనసాగుతోంది. గురువారం ప్రారంభమయ్యే మ్యాచ్‌కు సంబంధించి స్టేడియంలో ప్రేక్షకుల గ్యాలరీలలోకి ప్రవేశానికి పాసులు జారీలో ఇప్పటి వరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. రెండో రౌండ్ పోటీల తరహాలో ఆయా విద్యాసంస్థలకు సంబంధించి పాసులు ఇచ్చి ప్రవేశం కల్పిస్తారా...లేక సాధారణ ప్రజలకు పాసులు ఇస్తారా అనేది ఇంతవరకు తేల్చలేదు. ఆయా సంఘాల పేరుతో పాసులను తమకు నచ్చిన, అనుయాయులకు మాత్రమే అందజేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాకు వచ్చిన అరుదైన అవకాశాన్ని ఇలా దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొరవడిన సమన్వయం

ఎన్నడూ లేని విధంగా జిల్లాలో నిర్వహిస్తున్న దులీప్‌ట్రోఫీలో సమన్వయం కొరవడింది. బీసీసీఐ, ఆంధ్రా, జిల్లా క్రికెట్ సంఘాల మధ్య కొరవడిన సమన్వయ లోపంతో దేశవాళీ క్రికెట్ పోటీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. బీసీసీఐ నుంచి సుమారు రూ.5కోట్ల వరకు దులీప్‌ట్రోఫీ నిర్వహణకు నిధులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నిధులు ఏవిధంగా ఖర్చు చేస్తున్నారనేది కూడా రహస్యంగానే ఉంచుతున్నారు. మ్యాచ్ నిర్వహణ బాధ్యత ఎవరిది...ఎవరెవరికి ఏయే బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పాటు చేసిన దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ ఎక్కడ ఉంది అనేది అందరిలో కలుగుతున్న సందేహం. పరపతి ఉన్నోడికి...ఆయా సంఘాల్లో ఉన్నవాళ్లకే సాధారణ పాసులతో పాటు వీఐపీ, వీవీఐపీ పాసులు ఇస్తున్నారనే ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఏ, బీ గ్యాలరీల్లో అసలు ఎవరు వచ్చి క్రికెట్ చూస్తున్నారు. వారికి ఆ పాసులు ఎలా వచ్చాయనే కనీసం ఆరా తీయకుండా దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ ఉంది. గురువారం నుంచి జరిగే మ్యాచ్‌కు క్రికెట్ అభిమానులు ఎలా వచ్చి చూడాలి...పాసులు లేకున్నా అనుమతిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



ప్రాక్టీసులో పాల్గొన్న రింకూసింగ్

పరీక్షల ఫీజు గడువు పెంపు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 18: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును పొడిగించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేషన్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీసీసీ-2024 ఫలితాలు విడుదల

అనంతపురం విద్య, సెప్టెంబరు 18: ఈ సంవత్సరం ఏప్రిల్‌లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) -2024 పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీసీసీ లోయర్, హయ్యర్ అభ్యర్థుల పరీక్షల ఫలితాల వివరాలు https ://www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పాస్ సర్టిఫికెట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రాగానే అభ్యర్థులకు సమాచారం ఇస్తామని తెలిపారు.

అంగన్‌వాడీలకు

రూ.3.25 కోట్ల నిధులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 18: జిల్లాలోని అంగన్‌వాడీలకు రూ.3.25 కోట్లు మంజూరైనట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు కోసం ఈ నిధులు కేటాయించారని ఆమె తెలిపారు. వీటితో 609 అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు నిర్మించడానికి, ఒక్కొక్క కేంద్రానికి రూ.36 వేలు చొప్పున రూ.2.19 కోట్లు, 623 కేంద్రాల్లో మంచినీటి సదుపాయం కోసం, ఒక్కొక్క కేంద్రానికి రూ.12 వేలు చొప్పున రూ.1.06 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనుల నిర్వహణ బాధ్యతలను అనంతపురం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లకు అప్పటించినట్లు ఆమె స్పష్టంచేశారు.

ఫలితాలు విడుదల

కొత్తచెరువు, సెప్టెంబరు 18: టెక్నికల్ కోర్సులకు సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయని శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి తెలిపారు. డ్రాయింగ్‌లో లోయర్, హయ్యర్ అన్‌లూమ్ వీవింగ్‌లో లోయర్, హయ్యర్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్‌లో లోయర్, హయ్యర్ పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించామని, వాటి ఫలితాలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసిందని వివరించారు. ఉత్తీర్ణత, మార్కుల జాబితాను www.bse.ap.gov.inలో పొందవచ్చని పేర్కొన్నారు.

గడువు పొడిగింపు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలకు దరఖాస్తు గడువు ఈ నెల 24 వరకు ప్రభుత్వం పొడిగించిందని శ్రీ సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.bse.ap.gov.inలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆధార్ కార్డులో ఉన్న విధంగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ధృవపత్రాలు అవసరం లేదని, పరీక్షలు రాసే సమయానికి అన్ని సిద్ధం చేసుకోవాలని అన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.50 చెల్లించాలన్నారు. దరఖాస్తు ప్రింటెడ్ నామినల్‌రోల్, ఒరిజనల్ ఎస్‌బీఐ కలెక్టు రసీదును జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 27లోగా అందించాలని సూచించారు.

జీడిపల్లికి 909 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 18: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 909 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 864 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి నిల్వ 1.675 టీఎంసీలు ఉందని అధికారులు వెల్లడించారు.

టమోటా కిలో రూ.36

అనంతపురం రూరల్, సెప్టెంబరు 18: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.36తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 2,250 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని తెలిపారు. కిలో గరిష్ఠ ధర రూ. 36, సరాసరి ధర రూ.29, కనిష్ఠ ధర రూ.20పలికినట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధి వైపు అడుగులు..!

● రూ.5.14కోట్లతో రోడ్ల నిర్మాణం
● రూ.2కోట్లతో డ్రైనేజీ ఏర్పాటు
● 21న భూమిపూజ చేయనున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



భూమి పూజ చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 18: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధిని విస్మరించారు. ఎన్నికల ముందు హడావిడి చేసినా పనులు అంతంతమాత్రం గానే చేపట్టారు. ఆ పాలనకు ప్రజలు స్వస్తి పలికారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. అందుకు అనుగుణంగా అడుగులు పడుతున్నాయి. మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. మండలంలో రూ.5.04కోట్లతో సీసీ రోడ్లు, మట్టి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. మరో రూ.2కోట్లతో డ్రైనేజీల నిర్మాణం చేపట్టనున్నారు. ఈనెల 21వతేదిన ఎమ్మెల్యే పరిటాల సునీత అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ మండల నాయకులు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రూ.5.14కోట్లతో సీసీ, మట్టిరోడ్లు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. పాపంపేట పంచాయతీలో సీసీరోడ్లకు సంబంధించి రూ.1.39కోట్లతో 22 అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఇటుకలపల్లి, చియ్యేడు గ్రామాల్లో ఒక్కొక్క గ్రామంలో రూ.15లక్షలతో, ఆలమూరు రూ.20లక్షలు, కక్కలపల్లి కాలనీ రూ.43లక్షలు, కక్కలపల్లి రూ.17లక్షలు, ఆకుతోటపల్లిలో రూ.40లక్షలు, కందుకూరు పంచాయతీలోని కందుకూరు, కృష్ణంరెడ్డి పల్లిల్లో రూ.60లక్షలు, కామరుపల్లిలో రూ.10లక్షలతో సీసీరోడ్లు వేయనున్నారు. పూలకుంటలో రూ.10లక్షలు, రాచానపల్లి పంచాతీలోని రాచానపల్లి, సిండికేట్‌నగర్‌లో రూ. 32లక్షలు, సోములదొడ్డి పంచాయతీలోని సోములదొడ్డి, పాములరాయి గ్రామాల్లో రూ.31 లక్షలు, కురుగుంటలో రూ.30లక్షలు, కాట్నేకాలువలో రూ.12లక్షలు, తాటి చెర్లలో రూ.20లక్షలు, ఉప్పరపల్లిలో రూ.10లక్షలు, మన్నీలలో రూ.10 లక్షలలో సీసీ రోడ్లు వేయన్నారు. ఇవి కాక మరో రూ.2కోట్లతో ప్రతి గ్రామ పంచాయతీలో డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేపట్టనున్నారు.

21న లాంఛనంగా ప్రారంభం : అభివృద్ధి పనులు ఈ నెల 21న ఎమ్మెల్యే పరిటాల సునీత చేతులమీదుగా లాంచనంగా ప్రారంభం కానున్నాయి. ఇందుకు టీడీపీ మండల నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం కురుగుంటలో పనులను ప్రారంభించనున్నారు. ఆ తరువాత పాపంపేట, కక్కలపల్లి కాలనీ, మధ్యాహ్నం ఆకుతోటపల్లిలో పనులు ప్రారంభానికి ఎమ్మెల్యే భూమి పూజ చేయనున్నారు.

అభివృద్ధికి కేరాఫ్ టీడీపీ



అభివృద్ధి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కేరాఫ్ అడ్రస్. గత టీడీపీ హయాంలోనే గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాం. గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాలువలు కనిపిస్తున్నాయంటే టీడీపీ హయాంలో జరిగినవే. గ్రామాల అభివృద్ధి జరగాలంటే కేవలం టీడీపీతోనే సాధ్యం.

- జింకా సూర్యనారాయణ, మండల కన్వీనర్

వందరోజుల్లోనే అభివృద్ధికి అడుగులు



గత వైసీపీ పాలనలో స్థానిక ప్రజాప్రతినిధులు అభివృద్ధిని విస్మరించారు. కొన్ని చోట్ల అభివృద్ధి పనులు జరిగాయనుకున్నా...అంతంతమాత్రమే. కూటమి అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఎమ్మెల్యే పరిటాల సునీత అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు. త్వరలోనే డ్రైనేజీ కాలువల నిర్మాణానికి నిధులు విడుదల కానున్నాయి.

- మేకల వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ

బాధ్యతలు చేపట్టిన నగరపాలక కమిషనర్



కొత్త కమిషనర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న ఆర్డీ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18 : నగర కమిషనర్‌గా నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జోన్ ఆర్డీగా పనిచేస్తున్న నాగరాజును అనంతపురానికి బదిలీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మేఘస్వరూప్ బదిలీ కావడంతో అనంతరం ఇన్‌చార్జ్ కమిషనర్‌గా మున్సిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి కొనసాగారు. పీవీవీఎస్ మూర్తిని సీడీఎంఏలో అడిషనల్ డైరెక్టర్‌గా నియమించారు. ఆయన బుధవారం ఆర్డీ రిలీవ్ కావడంతో పాటు కమిషనర్‌గా నాగరాజుకు బాధ్యతలు అప్పగించారు.

రూరల్ డీఎస్పీగా వెంకటేష్...



బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ వెంకటేష్

రాప్తాడు, సెప్టెంబరు 18: అనంతపురం రూరల్ డీఎస్పీగా వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. రాప్తాడులోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. రాప్తాడులో విధులు నిర్వహిస్తున్న డీఎస్పీ వెంకటశివారెడ్డి బదిలీపై వెళ్లగా ఆ స్థానంలోకి ఉన్నతాధికారులు వెంకటేష్‌ను నియమించారు. నూతనం గా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ వెంకటేష్‌కు సిబ్బంది అభినంద నలు తెలిపారు.

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన: సీపీఐ

అనంతపురం విద్య, సెప్టెంబరు 18: ఐఏబీ సమావేశం నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గురువారం ఐఏబీ సమావేశం నిర్వహించనున్నారు. తుంగభద్రా డ్యాం 33 గేట్లను మార్చాలని, హెచ్చెల్సీ ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని, హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా చివరి ఆయకట్టు వరకూ నీరు ఇవ్వాలని ఈ సందర్భంగా జాఫర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలుపనున్నట్టు పేర్కొన్నారు.

రేపటి నుంచి స్కూల్‌గేమ్స్

శింగనమల, సెప్టెంబరు 18: స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు పోటీలు ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తునట్లు ఎంఈఓ నరసింహరాజు బుధవారం తెలిపారు. ఈనెల20న శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో అండర్ -14,17 విభాగం బాలురు, బాలికలకు పలు క్రీడల్లో, 21న అథెటిక్స్ పోటీలు ఉటాయని తెలిపారు. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు టీంలు తయారు చేసుకోవాలని ఎంఈఓ పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

శింగనమల: మండల సర్వసభ్య సమావేవాన్ని గురువారం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ నిర్మలా కూమారి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతందని, స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు హజరుకావాలని ఒక ప్రకటనలో అమె తెలిపారు.

చిన్నారులు పనిలో కాదు బడిలో ఉండాలి-

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18 : చిన్నారులు పనిలో కాకుండా బడిలో ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ)కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. సాయినగర్‌లోని జాతీయ నిర్మాణ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. యువత క్రమశిక్షణతో మెలగాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి బాధ్యతా యుతంగా అడుగులు వేసినప్పుడే సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిరోధించడానికి ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో స్పందించాలని న్యాయాధికారి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

'గొల్లపల్లి, పుల్లలరేవుకు సెల్ టవర్ ఏర్పాటు'



సంస్థ సిబ్బందికి ఒప్పంద పత్రం అందజేస్తున్న ధర్మవరపు మురళి

రాప్తాడు, సెప్టెంబరు 18: మండలంలోని గొల్లపల్లి, పుల్లలరేవు గ్రామాకు త్వరలో సెల్ టవర్ ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. ఆ గ్రామాల్లో సిగ్నల్ లేక ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీతను గ్రామస్థులు కోరారు. ఎమ్మెల్యే సెల్ టవర్ వారితో మాట్లాడి టవర్ ఏర్పాటుకు అనుమతి ఇప్పించారు. పనులు వెంటనే ప్రారంభించాలని నంబూరి కన్‌స్ట్రక్షన్స్ అధినేత నంబూరి రమణ, జియో ఆర్ఈ టీం మునికృష్ణకు ధర్మవరపు మురళి బుధవారం ఒప్పంద పత్రం అందజేశారు.

టీడీపీ సానుభూతిపరుడి మృతికి సంతాపం

గార్లదిన్నె, సెప్టెంబరు 18 : మండలకేంద్రమైన గార్లదిన్నె ఎస్సీ కాలనీలో నివాసముంటున్న టీడీపీ సాను భూతి పరుడు తిరుపాల్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముంటిమడుగు కేశవరెడ్డి గార్లదిన్నెకు వచ్చి తిరుపాల్ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పిం చారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 10 వేలు అందజేశారు. మాజీ జడ్పీటీసీ గుర్రం ఆదినారాయణ, శేఖర్‌నాయుడు, గుత్తాబాలకృష్ణ, మండల బీసీసెల్ అధ్యక్షులు శేఖర్, గ్రామ అధ్యక్షులు రామాంజి, చలపతి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు నిత్యావసరాల వితరణ

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 18 : నగరానికి చెందిన నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేసి నిత్యసురభి ట్రస్టు అండగా నిలిచింది. స్టాలిన్ నగర్‌లోని ఆ దంపతులకు మానసిక వికలాంగురాలైన కుమార్తె ఉంది. కుటుంబ పోషణ కోసం ఇబ్బందులెదుర్కొంటుండడంతో బుధవారం నిత్యసురభి ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి సదరు కుటుంబాన్ని కలిసి దాదాపు 35 రకాల నిత్యావసర సరుకులు, రూ.2వేలు ఆర్థికసాయం అందజేశారు. ట్రస్టు సభ్యులు సౌదామణి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

11 మంది వైసీపీ కార్యకర్తలపై కేసు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 18: మండల పరిధిలోని చెదళ్ల గ్రామంలో టీడీపీ మహిళా కార్యకర్తలపై దాడి చేసిన ఘటనలో 11 మంది వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. వాటర్ ప్లాంట్ తొలిగింపు విషయంలో మంగళవారం గ్రామంలోకి వెళ్లిన పోలీసులు, రెవెన్యూ అధికారులను వైసీపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో పాటు అధికారులు తీసుకెళ్లిన ఎక్స్‌కవేటర్‌ను రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. దీంతో వైసీపీకి చెందిన సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, భార్య శోభారాణి, నరసింహారెడ్డి, నరేంద్రరెడ్డి, శేషానందారెడ్డి, మహేశ్‌రెడ్డి, రామిరెడి, సుధా, నరేంద్రరెడ్డి, యరప్పరెడ్డి తదితరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. త్వరలోనే వారిని అరెస్టు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

ప్రతిభను ప్రోత్సహించడమే ఐఎస్‌టీఈ లక్ష్యం

జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు



వీసీ సుదర్శన రావును సత్కరిస్తున్న ఐఎస్‌టీఈ కార్యవర్గ సభ్యులు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 18 : సాంకేతిక విద్యా ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్‌టీఈ) లక్ష్యమని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో బుధవారం ఐఎస్‌టీఈ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ రంగజనార్ధన అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వీసీ సుదర్శనరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలోని అన్నిరాష్ట్రాల్లో ఐఎస్‌టీఈ కమిటీలను ఏర్పాటుచేసి అందులో విద్యార్థులను, అధ్యాపకులను సభ్యులుగా భాగస్వామ్యం చేస్తారన్నారు. గత సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కళాశాలలు, అధ్యాపకులు, విద్యార్థులను ఎంపికజేశారని తెలిపారు. వారందరికీ అక్టోబరు 25న కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అవార్డులను ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఐఎస్‌టీఈ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, రవీంద్రబాబు, బాలాజి, శివప్రసాద్‌రెడ్డి, విజయభాస్కర్, రాజు, భానుమూర్తి వీసీ సుదర్శనరావును ఘనంగా సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కోరి

అనంతపురం సెంట్రల్ : మానవాళి మనుగడకోసం పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం పౌరలందరి బాధ్యతని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి పేర్కొన్నారు. వర్సిటీలో బుధవారం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన దేశనిర్మాణానికి విద్యార్థులు నడుంబిగించాలని కోరారు. విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రేయ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 18 : వాతావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేదించడంవల్ల సమతుల్యమైన పర్యావరణం ఏర్పడుతందని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పరిసరాల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహనా ర్యాలీని వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు ఆనంద్‌బాబు, పురుషోత్తం, వలంటీర్లు వర్షిత, మదన్, సుహేత్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణల సృష్టికర్తలుగా రాణించాలి

● జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 18 : మేధస్సుకు పదునుపెట్టి కొత్త ఆవిస్కరణల సృష్టికర్తలుగా విద్యార్థులు రాణించాలని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి సూచించారు. కళాశాలలో బుధవారండాక్టర్ మమత, డాక్టర్ ఓంప్రకాష్ సమన్వయకర్తలుగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఆవిష్కరణలు సృష్టించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రమణరెడ్డి, రాజశేఖర్, శోభాబిందు, చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ రామశేఖర్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

● అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అనంతరాముడు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 18: మహిళలను గౌరవించడం అందరి బాధ్యతని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల చైర్మ అనంతరాముడు పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం 'మహిళలపై లైంగిక వేధింపులు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిగా హాజరైన అనంతరాముడు మాట్లాడుతూ మహిళల భద్రతా చట్టాలపై విద్యార్థులు అగాహన పెంచుకోవాలని తెలిపారు. అనంతరం ఉమెన్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి మాధవి పలుఅంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామమూర్తి, డీన్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పల్లె జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 18: మండలంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న పీవీకేకే ఐటీలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలను ఘనం నిర్వహించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తును తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలి పారు. అలాగే బాలాజీ విద్యాసంస్థలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ఆవరణంలో ఆయనతో కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, పీవీకేకే కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, శర్మ, మనోహర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమణ, సంతోష్ కుమార్‌రెడ్డి, భాష, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ వాడకంపై విజిలెన్స్ కొరడా

అనంతపురంరూరల్, సెప్టెంబరు 18: జిల్లాలో అక్రమ విద్యుత్ వాడకంపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అక్రమ విద్యుత్ వాడకందారులపై జరిమాన విధించారు. నగరంలోని డి-5సెక్షన్, శ్రీ సత్యసాయి జిల్లాలోని ఓబుళదేవరచెరువు, అమరాపురం మండలాల్లో విద్యుత్ విజిలెన్స్ ఈఈ గోపి ఆధ్వర్యంలో అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ..తనిఖీల్లో మాల్‌ప్రాక్టీస్ కేసులు ఎనిమిది, తక్కువ లోడు కనెక్షన్ తీసుకుని ఎక్కువ లోడ్ వాడుతున్న 32 మంది వినియోగదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే సర్వీసులకు డైరెక్ట్ టాపింగ్ చేస్తున్న ఐదుగురు, మీటరు లేకుండా డైరెక్టుగా విద్యుత్ వాడుతున్న మరో ఐదుగురు, మీటర్ ఉండి డైరెక్టుగా కరెంటు వాడుతున్న ఇంకో ఐదుగురిపై కేసులు పెట్టినట్లు తెలిపారు. తద్వారా రూ.2.46లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈదాడుల్లో డీఈఈలు రామాంజినేయులు, నాగేంద్ర, ఏఈఈలు పాల్గొన్నారు.

సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ

రామగిరి, సెప్టెంబరు 18: మండలంలోని పేరూరు గ్రామంలో ప్రభుత్వ సహకారంతో ఏపీఎంఐపీ సిగ్నేట్‌డ్రిప్ కంపెనీ వారు రైతులకు 90, 70శాతం సబ్సిడీతో స్ప్రింకర్లు, డ్రిప్‌లను బుధవారం పంపిణీచేశారు. పది మంది పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఇనయ్‌తుల్లా, ఆదెప్ప, శ్రీనివాసులు, లింగమయ్య, బెస్త ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రజా డాక్టర్ మృతి

రామగిరి, సెప్టెంబరు 18: మండల కేంద్రమైన రామగిరిలో ప్రజా డాక్టర్‌గా పేరొందిన డాక్టర్ కొత్తపల్లి వెంకటేశ్వర చౌదరి(56) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతిపట్ల రామగిరితో పాటు సమీప గ్రామాలైన కానుగులకుంట, ఆర్‌కొత్తపల్లి గ్రామాల్లోని ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు. ఏ జబ్బు వచ్చిన డబ్బు ఉన్నాలేకున్న వైద్యం చేసేవాడని రూ.10 ఇచ్చిన తీసుకునే వాడని, రూ.10 డాక్టర్ అని కూడా పిలిచేవారని గ్రామస్తులు తెలిపారు. డాక్టర్‌కుభార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన బీజేపీ మండల కన్వీనర్‌గా పనిచేశారు

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేద్దాం: ఆర్ఎం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 18: ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ ఆదాయాన్ని వృద్ధి చేసి రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషిచేద్దామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సిబ్బందికి సూచించారు. డిపోలోని ఆర్ఎం కార్యాలయంలో బుధవారం రీజియన్‌లోని డిపో ట్రాఫిక్ ఇన్చార్జిలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రతి బస్సు రూట్‌కు వెళ్లకముందే పనితీరును పరీక్షించాలని సూచించారు. కార్గో సర్వీసుపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ సీటీఎం రమేష్‌బాబు, డీఎంలు నాగభూపాల్, జీఎల్ శంకర్, రామచంద్ర, సురేష్‌కుమార్, బాలాజీ దయాళ్, పీఓ చెంద్రాయుడు, ట్రాఫిక్ ఇన్చార్జి వీవీ బాబు, యస్‌కే నాయక్, ఎస్టీఐ నాగార్జున, ఏఎంఎఫ్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ భూమిని కాపాడాలి

సీపీఐ నాయకుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద అందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు18: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండమీద రాయుడు వెలసిన దేవరకొండకు చెందిన కోట్ల విలువ చేసే భూమిని వైసీపీ, టీడీపీ నేతలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం సీపీఐ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ స్వామి మాట్లాడుతూ.... బుక్కరాయసముద్రం పరిధిలోని సిద్ధరాంపురం రోడ్డు వద్ద ఉన్న దేవర కొండకు చెందిన కోట్ల విలువ చేసే ఆలయం భూమి సర్వేనెంబరు396-7లో 1.70 ఎకరాలను వైసీపీ, టీడీపీ నేతలు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే యత్నించగా అప్పట్లో సీపీఐ ఆధ్వర్యంలో అడ్డుకున్నామన్నారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చాక కొంత మంది టీడీపీ నాయకుల సహకారంతో వైసీపీ నేతలు తిరిగి కబ్జాకు యత్నిస్తున్నారన్నారు. వెంటనే ఈ భూమిలో దేవాలయం అధ్వర్యంలో కమ్యూనిటీ హాల్, భవన నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం ఇచ్చారు. ఈ అంశంపై తహసీల్దార్ మాట్లాడుతూ... ఈ భూమి ప్రభుత్వానికి చెందినదని బోర్డు పెట్టామన్నారు. ప్రైవేటు వ్యక్తులు ప్రవేశిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీపీఐ నాయకులు బండిరామక్రిష్ణ, శ్రీనివాసులు, భాష, వెంకటరాముడు, భాస్కర్, రామాంజినేయులు, నాగేంద్ర తదితరుల పాల్గొన్నారు.

వందరోజుల పాలనలో వంద అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబరు18: రాష్ట్రంలో కూటమి వందరోజుల పాలనలో వంద అభివృద్ధి, సంక్షేమాలకు చేపట్టిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా ఎమ్మెల్యే బుధవారం మాట్లాడుతూ.... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే పింఛన్లు రూ.4వేలకు పెంచి ఇళ్ల వద్ద అందివ్వడంలో దేశంలోనే మెదటి రాష్ట్రం అన్నారు. ఎన్నికల హామీల మేరకు వంద రోజుల్లో వంద అభివృద్ధి, సంక్షేమాలు చేపట్టి సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని అమె తెలిపారు.

నియోజకవర్గం అభివృద్ధికి నిధులివ్వండి

మంత్రి లోకేశ్‌ను కోరిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



మంత్రి లోకేశ్‌ను కలసిన ఎమ్మెల్యే

శింగనమల/ బుక్కరాయసముద్రం, సెప్టెంబరు18: నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విన్నవించారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో బుధవారం కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశం అనంతరం ఆమె మంత్రి నారాలోకేశ్‌ను కలిశారు. శింగనమల నియోజకవర్గంలో తాగు సాగు నీరుతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. అలాగే విజయవాడ వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గంలోని పలువురు టీడీపీ కార్యకర్తలు ఇచ్చిన కొంత నగదు అందజేశారని ఆమె తెలిపారు. దానిని చెక్కు రూపంలో మంత్రి లోకేశ్‌కు అందజేశారు.

వరద బాధితులకు సాయం



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న అనంతయ్య

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 18 : విజయవాడ వరద బాధితులకు సిప్లాన్ డ్రగ్స్ అధినేత అనంతయ్య ఆర్థిక సాయం చేశారు. ఆయన బుధవారం విజయవాడలో మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి సీఎం చంద్రబాబునాయుడుకు రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అనంతయ్యను చంద్రబాబు అభినందించారు.

పంట సాగుకు హెచ్ఎల్‌సీ నీరందించాలి

మాజీ మంత్రి శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు18: హెచ్ఎల్‌సీ ద్వారా సాగు నీటిని అందించి రైతులకు ఆదుకోవాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్య కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమలో అనంతపురం జిల్లా ప్రథమస్థానంలో ఉందదన్నారు. జిల్లాకు ఉన్న ఏకైక నికర సాగునీటి వనరు హెచ్ఎల్‌సీ మాత్రమే అన్నారు. అలాగే రాష్ట్ర సరిహద్దులో హెచ్ఎల్‌సీ ఆధునికీకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్



మాట్లాడుతున్న పెద్దనగౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 18 : గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగానే పెన్షనర్లకు అందించే అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను అమలు పరచాలని ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లా డారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు.. గత వైసీపీ ప్రభుత్వంలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ అంశాన్ని ప్రస్తుతం జరిగిన కేబినేట్ సమావేశాల్లో ప్రస్తావిం చి ఉంటే పెన్షనర్లకు కాస్త ఊరట లభించేదన్నారు. అయితే మరోమారు నిర్వహించే సమావేశాల్లో ఈ అంశంతో పాటు వైసీపీ అటకెక్కించిన పథకాలను మునుపటిలాగే అమలు చేయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో పడిన కష్టాలను కూటమి ప్రభుత్వం సమూలంగా ప్రక్షాళన చేస్తుందనే పెన్షనర్ల ఆ నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు.

స్కూల్ స్వీపర్లకు వేతన బకాయిలు ఇవ్వాలి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18 : మున్సిపల్ స్కూల్ స్వీపర్లు, వాచ్‌మెన్లకు బకాయి వేతనం వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గత పాతికేళ్లుగా పనిచేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్లకు రూ.4వేలు మాత్రమే ఇవ్వడం సరైంది కాదన్నారు. వేతనాలు వెంటనే ఇవ్వాలని వారు కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి(50) చెందాడు. ఓపీలు ఇచ్చే గది ఎదుట బుధవారం ఆ వ్యక్తి పడిపోయాడు. అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు తెలుస్తోంది. పింక్‌కలర్ షర్ట్, తెలుపురంగు లైన్స్, లోపల ఎరుపు రంగ్ టీషర్ట్, జంగిల్ ప్యాచ్ నిక్కర్, దానిపై నీలం రంగు లోయర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎడమ చేతికి పుట్టుమచ్చ, దవడపై ఒక పుట్టుమచ్చ ఉంది. అతడి వివరాలు తెలిస్తే సంప్రదించాలని టూటౌన్ సీఐ శ్రీకాంత్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గార్లదిన్నె, సెప్టెంబరు 18: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ విజయ్ బాస్కర్ పేర్కొన్నారు. రెండో రోజు బుధవారం గార్లదిన్నెతో పాటు అన్ని పంచాయతీలలో స్వచ్చత హి సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పెనకచెర్ల గ్రామ సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రి, సెప్టెంబరు 18: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నాలుగో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంతేసులు బుధవారం ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కోపా, మెకానికల్ డీజిల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని, 27న కళాశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని, 28న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులు మాత్రమే మెరిట్‌లిస్ట్‌లో ఉంటారని అన్నారు.

పెన్షనర్ల సంఘానికి విరాళం

తాడిపత్రి, సెప్టెంబరు 18: పట్టణంలోని టీచర్స్‌కాలనీలో ఉన్న పెన్షనర్ల సంఘానికి బుధవారం రూ.10వేలు విరాళంగా వచ్చిందని అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు. సంఘం తరఫున నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై తమ వంతు సాయంగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు నూర్జహాన్ రూ.10వేలు అందించారని తెలిపారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పనులు వందశాతం పూర్తిచేయాలి

పుట్లూరు, సెప్టెంబరు 18: మండలంలో ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు, పనులు వందశాతం పూర్తిచేయాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూలీల సంఖ్యను వందశాతం పెంచాలన్నారు. హార్టికల్చర్, బండ్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్, కమ్యూనిటీ సోక్ పిట్లు తదితర అంశాలపై చర్చించారు. ప్రతి గ్రామంలో కూలీలకు పనులు కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ చెన్నకేశవులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రూ.20వేల ఆర్థికసాయం

తాడిపత్రి, సెప్టెంబరు 18: పట్టణంలోని యల్లనూరు రోడ్డులో ఉన్న వివేకానంద హైస్కూల్లో బుధవారం యల్లనూరు మండలం చిలమకూరు గ్రామానికి చెందిన ప్రణతికి క్యాన్సర్ చికిత్స కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.20వేలు ఆర్థికసాయం అందజేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు. వైద్యం చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో సభ్యుల సహకారంతో ఆర్థికసాయాన్ని చిన్నారి తండ్రి గంగరాజుకు అందించామని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు రామాంజనేయులు, శంకర్, నాగభూషణరావు, కుమారస్వామి పాల్గొన్నారు.

అనధికార బాణసంచా దుకాణాలపై దాడులు



తాడిపత్రిలోని ఓ దుకాణంలో సోదా చేస్తున్న సీఐ తదితరులు

తాడిపత్రి, సెప్టెంబరు 18: ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు పట్టణంలో బుధవారం అనధికారికంగా బాణసంచా విక్రయించే దుకాణాలపై దాడులు నిర్వహించినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. ఈ సోదాల్లో రెండు దుకాణాల్లో అక్రమంగా బాణసంచాను విక్రయిస్తున్నట్లు గుర్తించి సీజ్ చేశామన్నారు. అనంతరం ఆయా దుకాణాల యజమానులతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించి అనధికారింగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వారికి నోటీసులు అందజేశారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలో బాణసంచా అక్రమ నిల్వలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ ఈరన్న ఆధ్వర్యంలో సిబ్బంది మూడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ.68వేలు విలువగల బాణసంచాను సీజ్‌చేశారు. బాణసంచాను అక్రమంగా నిల్వ చేసిన ముగ్గురిపై కేసునమోదుచేసినట్లు సీఐ తెలిపారు. బాణసంచాను అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా హెచ్చరించారు.

ఇసుక డంపుల సీజ్

పెద్దపప్పూరు, సెప్టెంబరు 18: మండల కేంద్రంతో పాటు గార్లదిన్నె, బొందలదిన్నె గ్రా మాల్లో గల ఇసుక డం పులను ఎస్ఐ గౌస్‌బాషా, రెవెన్యూ సిబ్బంది బుధవారం సీజ్ చేశారు. ఎవరైనా అక్రమంగా ఇసుక ను తరలించినా, డంప్‌చేసినా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

ద్విచక్రవాహనానికి నిప్పు

తాడిపత్రి, సెప్టెంబ రు18: మండలంలోని చుక్కలూరు గ్రామంలో టీడీపీ మద్దతుదారుడు రాముకు చెందిన ద్విచక్రవాహనాన్ని బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారని రూరల్ పోలీసులు తెలిపారు. రాము మంగళవారం రాత్రి తన ఇంటి ముందు రోజు మాదిరిగానే ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేశారు. తెల్లవారిచూసేసరికి ద్విచక్రవాహనం సీటు, ట్యాంక్ కవర్, బ్యాగు కాలిపోయి కనిపించాయి. వర్షం ప డడంతో వాహనం మొత్తం కాలిపోకుండా మంటలు ఆరిపోయాయి. సమాచారాన్ని రాము పోలీసులకు చేరవేశారు. ద్విచక్రవాహనాన్ని సీఐ శివగంగాధర్ రెడ్డి, ఎస్ఐ కాటయ్య పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

సీతారాం ఏచూరికి నివాళి

పెద్దపప్పూరు, సెప్టెంబరు 18: మండలంలోని అమ్మలదిన్నె గ్రామంలో బుధవారం సీపీఎం నేత సీతారాం ఏచూరికి స్థానిక ఆ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. చెక్కభజన కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుళ్లాయప్పతోపాటు పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 18: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉర్దూ (సెకెండ్ లాంగ్వేజ్) బోధించుటకుగాను గెస్ట్ ఫ్యాకల్టీ నియమకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయభాస్కర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్ ఉర్దూలో కనీసం 50శాతం మార్కులు కలిగినవారు అర్హులన్నారు. కళాశాలలోని ఆఫీస్‌లో దరకాస్తులను అందజేయాలన్నారు. ఇంటర్వ్యూ ఈనెల 21 తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించను న్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలి

కళ్యాణదుర్గం(కంబదూరు), సెప్టెంబరు 18: కంబదూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.300పైన సభ్యత్వం తీసుకుని ఉన్న రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలని సంఘం కార్యదర్శి ముత్యాలప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేయించుకోవాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్, రేషన్ కార్డు, జిరాక్స్‌లతో రెండు ఫొటోలు ఇవ్వాలని ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం పట్ల మొగ్గు చూపాలి

● రైతులకు కలెక్టర్ సూచన

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 18: రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల మొగ్గు చూపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మండలంలోని వెంకటంపల్లిలో నిర్మాణ దశలో ఉన్న కోల్డ్ స్టోరేజ్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితం రైతులు రసాయనాలు, పురుగు మందులు ఉపయోగించకుండా సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించారన్నారు. మళ్లీ ఇప్పుడు అక్కడక్కడ ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారని అన్నారు. ఇది శుభ పరిణామం అన్నారు. రైతులందరూ రసాయనిక మందులు వాడకుండా ప్రకృతి సేద్యం వైపు ఆసక్తి చూపాలని కోరారు. త్వరలో బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల నుంచి కార్పొరేట్ సంస్థలను ఆహ్వానిస్తూ జిల్లా స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, అమ్మకందారుల సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సహజ పద్ధతుల ద్వారా పంటలు పండించేందుకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని మల్లాపురం రైతులు కోరారు. తర్వాత రైతులకు మట్టి నమూనా పరీక్ష కార్డులను, ఉలవలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఏపీపీఐడీ రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు, ఆయా శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



వెంకటంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఐదెంచెల పద్ధతిలో సాగైన పంటల పరిశీలన

కుందుర్పి: మండలంలోని అపిలేపల్లిలో ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ సంస్థ ద్వారా పైలెట్ ప్రాజెక్టుగా ఐదెంచెల పద్ధతిలో సాగుచేసిన వివిధ పంటల ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పంటల సాగుపై స్థానిక రైతులతో ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు. దాదాపుగా వంద ఎకరాల్లో 22 మంది రైతులు ఉమ్మడిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో మొక్కలను పెంచడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై వైపు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో శంకర్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మీనరసింహ, ఏఎఫ్ ఎకాలజీ సిబ్బందికి పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ ద్వారా చేపట్టిన పనుల పరిశీలన

కళ్యాణదుర్గం(శెట్టూరు): శెట్టూరు మండలం ఎర్రబోరేపల్లి గ్రామంలో వాటర్‌షెడ్ ద్వారా చేపట్టిన పలు పనులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆర్డీటీ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వాటర్‌షెడ్ ద్వారా పెంచిన మొక్కలను, సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంత రం వాటి గురించి రైతులనడిగి తెలుసుకున్నారు. అలాగే వాటర్‌షెడ్ పథ కం ద్వారా చేపట్టిన మామిడి, నేరేడు, సీతాఫలం, ఉసిరి , జామ మొక్కల పెంపకంలో అవలంభిస్తున్న విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కనకాంబరం, టమోట పంటలను పరిశీలించారు. తర్వాత గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీవో రాణిసుష్మిత, తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రఘురామరావు, ఎంఈఓ శ్రీధర్, వీఆర్వోలు, సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగుదాం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

గుత్తి, సెప్టెంబరు 18: స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా అందరం ముందుకు సాగుదామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంకటశివుడు యాదవ్ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటు పడాలని కోరారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. తర్వాత అందరూ వారంలో రెండు గంటల పాటు పరిసరాల పరిశుభ్రం కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అంతకుమునుపు అక్కడి గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు చికెన్ శీన, సుధాకర్‌నాయుడు, ప్రసాద్, వేణు, రామాంజినేయులు, రమేష్, కృష్ణయ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: 74 ఉడేగోళం గ్రామ సమీపంలో ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వారు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్థానిక కోతిగుట్ట సర్కిల్ వద్ద స్వచ్ఛతపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, దొడ్డ నాగప్ప, వలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని తూర్పు, పడమర గోపురాల వద్ద ఉన్న మెట్లను నీటితో శుభ్రం చేశారు. ఆలయ పరిసరాలలో పిచ్చిమొక్కలను, ముళ్లపొదలను తొలగించారు. ఆలయ ఈవో విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



గుత్తిలో స్వచ్ఛతాహి సేవలో పాల్గొన్న వెంకటశివుడు యాదవ్ తదితరులు

బొమ్మనహాళ్: స్వచ్ఛతాహి సేవలో భాగంగా అధికారులు మండల వ్యాప్తంగా పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే స్వచ్ఛత పరుగు, సైకిల్ పరుగు, మారథాన్ కార్యక్రమాలు నిర్వహించారు. గోనేహాళ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో, రోడ్లలో , డ్రైనేజీలోనూ పరిశుభ్రత చర్యలు చేపట్టారు.

తాడిపత్రి: పట్టణంలోని 24వవార్డులో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశాలమేరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా అండర్ డ్రైనేజీ చాంబర్లలో పూడికతీత పనులు చేపట్టారు. దోమలు వృద్ధిచెందకుండా పలుచోట్ల బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షెక్షావలి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 18: మండలంలోని మల్లికేతి గ్రామానికి చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకెళ్తే.. మల్లికేతి గ్రామానికి చెందిన కురుబ హనుమేష్, లక్ష్మి(28) దంపతులు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. కాగా రెండు నెలల క్రితం మృతురాలి మామ ఆస్తిని ఇద్దరి కుమారులకు పంచారు. ఈ పంపకాల్లో కొన్ని రోజులుగా ఇద్దరి తోడికోడళ్ల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో గొడవలు కూడా జరిగాయి. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మి ఈ నెల 16వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స కోసం బళ్లారి విమ్స్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

వరద బాధితులకు గార్మెంట్స్ అసోసియేషన్ చేయూత

● సీఎంను కలిసి డీడీలను అందించిన ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన పలువురు దాతలు ముందుకు వచ్చారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపా రు. అందులో భాగం గా గార్మెంట్స్ అసోషియేషన్ వారు రూ. 3 లక్షలను డీడీ రూపంలో సీఎం సహాయనిధికి అందించారన్నారు. అలాగే పలువురు పరిశ్రమల యజమానులు కూడా సాయమందించారన్నారు. రాయదుర్గం నియోజకవర్గం తరఫున ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సీఎం చంద్రబాబును బుధవారం మధ్యాహ్నం విజయవాడలో కలిసి రూ. 8.20 లక్షలను డీడీల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో రాయదుర్గం గార్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు, కేబీ మురళీకృష్ణ, బిసా శ్రీనివాసులు, జి నాగేంద్రప్రసాద్, మాంత శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే విజయవాడ సింగ్‌నగర్‌లో వారు జీన్స్‌ప్యాంట్లను ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో వరద బాధితులకు అందజేశారు.



సీఎంకు డీడీని అందిస్తున్న ఎమ్మెల్యే కాలవ

వ్యక్తిపై కేసు నమోదు

తాడిపత్రి, సెప్టెంబరు 18: పట్టణంలోని రామచంద్రలాడ్జి సమీపంలో నివాసం ఉండే సయ్యద్ ఇస్మాయిల్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. సయ్యద్ ఇస్మాయిల్ ప్రతిరోజూ చికెన్ సెంటర్ల నుంచి వ్యర్థాలను తీసుకుని వీధిలో ఉండే కుక్కలకు ఆహారంగా పెడుతుండేవాడు. దీంతో ప్రతిరోజూ చికెన్ వ్యర్థాలను తింటున్న కుక్కలు వీధిలోని చిన్నారులను, పెద్దలను కరుస్తున్నాయి. ఇదే కాలనీలో నివాసం ఉంటున్న రిజ్వానా నాలుగేళ్ల కుమారుడు మహమ్మద్‌గౌస్‌ను ఇటీవల కుక్కలు కరిచి గాయపరిచాయి. దీంతో చికెన్ వ్యర్థాలను కుక్కలకు పెట్టరాదని ఆమె పలుమార్లు చెప్పినప్పటికి ఇస్మాయిల్ వినలేదు. దీంతో రిజ్వానా ఫిర్యాదు చేయడంతో ఇస్మాయిల్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

బొమ్మనహాళ్, సెప్టెంబరు 18: మండలకేంద్రంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రుక్మిణీ పాండురంగస్వామి ఆలయం వద్ద విశ్వకర్మ చిత్రపటాన్ని ఉంచి విశేష పూజలు జరిపారు. అంతకుమునుపు ఆలయంలో రుక్మిణీ పాండురంగస్వామి అర్చకులు గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచ న, కంకణధారణ, అఖం డ జ్యోతి ప్రజ్వలన, బ్ర హ్మ మహా కలశ స్థాప న, గాయత్రి విశ్వకర్మ ఆ వాహన బ్రహ్మ కలశ పూజ, పంచామృతాభిషే కం నిర్వహించారు. సాయంత్రం విశ్వకర్మ చిత్రపటంను ట్రాక్టర్‌లో ఉం చి ఊరేగించారు. మహిళలు కలశాలు పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.



విశ్వకర్మ చిత్రపటం ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కర్నూలు కోర్టుకు ఎంఈఓ

కూడేరు, సెప్టెంబరు 18: మండలంలోని గొట్కూరు వద్ద ఉన్న ది వీరీడిఎన్ ఎకోలి ప్రైవేటు పాఠశాలలో హెచ్ఆర్ లక్ష్మీనారాయణ సాగర్ నుంచి రూ. 2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఎంఈఓ-1 చంద్రశేఖర్‌ను కర్నూలు కోర్టుకు తరలించారు. మంగళవారం రాత్రి ఏసీబీకి చిక్కిన ఎంఈఓను రాత్రంతా కూడేరు ఎమ్మార్సీలో విచారణ చేసిన ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం వరకు కర్నూలు కోర్టుకు తరలించారు.

గర్భిణులకు సీమంతం

తాడిపత్రి, సెప్టెంబరు 18: పట్టణంలోని 27వార్డు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు కౌన్సిలర్ రేష్మాపర్వీన్ సీమంతం జరిపించారు. ఈ సందర్భంగా వారికి చీర, సారెతో పాటు పండ్లు, స్వీట్లు అందించారు. అనంతరం పౌష్టికాహారమైన పాలు, గుడ్లను బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలకు అందజేశారు.

20నుంచి స్కూల్ గేమ్స్

గుత్తి, సెప్టెంబరు 18: పట్టణంలోని ఎంఎస్ ఫుట్ బాల్ క్రీడామైదానంలో స్కూల్ గేమ్ అండర్14, 17 బాల బాలికలకు ఈనెల 20వ తేదీ నుంచి రెండు రోజుల పాటు మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించన్నుట్లు పీఈటీ పుష్పరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని క్రీడా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 20, 21 తేదీలలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలియజేశారు. మండల స్థాయిలోని వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

పంట కాలువల పరిశీలన

పామిడి, సెప్టెంబరు 18: పట్టణంలోని పీ కొండాపురంలో గల ఓ వెంచర్‌లో పంట కాలువను చిన్న నీటి పారుదల శాఖాధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ... పంట కాలువలు కుచించుకుపోయి వర్షాకాలంలో తీవ్ర ఆటంకం ఏర్పడుతోందన్నారు. వరద, వర్షపు నీరు పోయేందుకు ఇబ్బందికరంగా ఉండడంతో పంట పొలాలు, రోడ్లపై పారుతున్నాయన్నారు. పంటకాలువ ఆక్రమణల తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈ గురుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ చేసుకోండి

పామిడి, సెప్టెంబరు 18: మండలంలోని రైతులు 2024-25 ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లీనావసుంధర బుధవారం ప్రకటనలో సూచించారు. ఇప్పటి వరకూ 8774 మంది రైతులు 27,017వేల ఎకరాల ఈ క్రాప్ బుకింగ్ చేసుకున్నారన్నారు. మిగిలిన వారు కూడా వెంటనే ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని అన్నారు. ఈక్రాప్ నమోదు అయిన వారు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, సెప్టెంబరు 18: మండలంలోని గన్నెవారిపల్లికాలనీ శివారులో బుధవారం ఐదుమంది పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి రూ.5వేలు నగదు, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను సీజ్‌చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి పేకాటరాయుళ్లను అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉరవకొండ: పట్టణ శివారులోని రాయంపల్లి రహదారిలోని జగనన్న లేఅవుట్‌లో పేకాట ఆడుతున్న 7మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.7,200లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేష్ తెలిపారు.

బైక్ షోరూంలో చోరీ

● షట్టర్ పగులగొట్టి రూ. 1.80 నగదు దోచుకెళ్లిన దుండగులు

కణేకల్లు, సెప్టెంబరు 18: మండల కేంద్రంలోని ఉడేగోళం వద్ద ఉన్న బైక్ షోరూంలో ఇద్దరు దుండగులు చొరబడి రూ. 1.80 లక్షలను దోచుకెళ్లారు. బాధితుడు దాదాపీర్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రోజులాగే మంగళవారం రాత్రి షోరూంను క్లోజ్ చేసుకుని వెళ్లామని, బుధవారం ఉదయం వచ్చి చూడగా షట్టర్లు పగిలిపోయి కనిపించాయని తెలిపారు. వెంటనే లోపలికి వెళ్లగా చోరీ జరిగినట్లు గుర్తించామన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. ఎస్ఐ నాగమధు సంఘటనా స్థలానికి చేరుకుని చోరీ విషయంపై ఆరా తీశారన్నారు. సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు దుండగులు తెల్లవారుజామున 4 గంటల సమయంలో షోరూంలోకి ప్రవేశించి 5 గంటల వరకు ఉన్నట్లు, అక్కడి నగదును చోరీ చేసుకుని వెళ్లడాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. అనంతరం బొలెరో లగేజ్ వాహనంలో దుండగులు పరారైనట్లు గుర్తించడం జరిగిందన్నారు. సంఘటన స్థలాన్ని క్లూస్‌టీం కూడా వచ్చి పరిశీలించారని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



షోరూం షట్టర్‌ను పగులగొట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

కిరాణా దుకాణంలో..

రాయదుర్గంరూరల్: మండలంలోని ఆవులదట్ల గ్రామ సమీపంలో హైస్కూల్ వద్ద రాయదుర్గం - అనంతపురం జాతీయ రహదారి పక్కన తిప్పేస్వామికి సంబంధించిన కిరాణాషాపులో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. దుండగులు షాపు వెనుకభాగానా రేకులు కత్తిరించి లోపలికి ప్రవేశించి రూ.4 వేల నగదు, రూ. ఏడు వేల విలువ గల సిగరెట్లు, గుట్కాలు, సబ్బులు తదితర సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టీ స్టాలో..

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్ రోడ్డులో గోవిందు టీ స్టాల్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి గుర్తుతెలియని దుండగుడు షాపు తాళాలను రాడ్‌తో పగలగొట్టి లోపలికి చొరబడ్డాడని, షాపులో ఉన్న మూడు సీసీ కెమెరాలను కనెక్షన్లను తొలగించి ఎత్తుకెళ్లాడని, మరో సీసీ కెమెరాను అక్కడే వదిలివెళ్లాడని, క్యాష్ పెట్టెలో ఉన్న రూ. 1.15లక్షల నగదు, రూ.15వేలు విలువ చేసే సిగరెట్లను చోరీ చేశాడని బాధితుడు పల్లా గోవిందరాజులు తెలిపారు. షాపు తాళాలను పగలగొట్టే దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయన్నారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నాడు.

పోలీసుల అదుపులో నిందితులు

ఉరవకొండ, సెప్టెంబరు 18: పట్టణంలో ఓ టిప్పర్‌ను చోరీ చేసిన కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టణంలోని గవిమఠంలో అనుమానాస్పదస్థితిలో తిరుగుతున్న హోస్పేటకు చెందిన మహేష్, గురుస్వామిని పోలీసులు బుధవారం విచారించగా.. పెన్నహోబిలం దేవస్థానానికి వచ్చినట్లు తెలిపారు. వీరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి 2023లో ఉరవకొండలో ఓ టిప్పర్ చోరీ కేసులో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిపై కర్ణాటకలో కూడా కేసులు ఉన్నాయి. కర్ణాటక పోలీసులు కూడా ఉరవకొండకు చేరుకుని వారిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరినట్లు సమాచారం.

వైద్యుడికి షోకాజ్ నోటీసు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 18: పట్టణంలో చిన్నారి ఇంతియాజ్ మృతి చెందిన సంఘటనపై స్థానిక ఆర్టీగుప్త హాస్పిటల్ నిర్వాహకుడు డాక్టర్ కీర్తికిరణ్‌రెడ్డికి షోకాజ్ నోటీసు ఇచ్చామని డీఎం హెచ్ఓ ఈబీ దేవి తెలిపారు. చిన్నారి మృతిపై విచారించేందుకు బుధవారం రాత్రి ఆస్పత్రికి ఆమె వచ్చారు. అంతకుమునుపే చిన్నారి తండ్రి షఫీతో ఫోన్‌లో మాట్లాడి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మేనమామ సలీంను కూడా విచారించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి వద్ద విలేకరులతో మాట్లాడుతూ చిన్నారి మృతిపై సమగ్ర విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ఇప్పుడు డాక్టర్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. ఆయన ఇచ్చిన సమాధానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపిక

కదిరి, సెప్టెంబరు 18: శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన బాదుల్లా, కళ్యాణదుర్గం నియోజకవర్గం నూతిమడుగు గ్రామానికి చెందిన కె. కార్తీక్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డుకు ఎంపికయ్యారు. బాదుల్లా ఇగ్నో అనే హారర్ వెబ్ సిరీస్ తీశాడు. అలాగే కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన కార్తీక్ మహాశివ అనే షార్ట్ ఫిల్మ్‌ను తీశాడు. మహాశివుని ఆలయం గురించి దాని ప్రాధాన్యంను అందులో వివరించాడు. వీరిద్దరూ బెస్ట్ షార్టు ఫిల్మ్ డైరెక్టర్ అవార్డుకు ఎంపికయ్యారు. వీరిద్దరికీ వచ్చే నెల 17న అవార్డులు అందజేస్తారు.



డైరెక్టర్ కార్తీక్

రైల్లో నుంచి పడి మహిళకు గాయాలు

గుత్తి, సెప్టెంబరు 18: గుత్తి రైల్వేస్టేషన్‌లో బుధవారం కదులుతున్న రైల్లో నుంచి ఓ మహిళ దిగడానికి ప్రయత్నించి ప్రమాదవశాత్తూ కిందపడి గాయపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. హైదరాబాదుకు చెందిన గోపినాథ్, అనూష దంపతులు రాజంపేట నుంచి హైదరాబాద్‌కు పూణే ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్నారు. ఆ రైలు గుత్తికి చేరుకోగానే నీటి కోసం గోపినాథ్ కిందకుదిగి ప్లాట్‌ఫాంలోకి వెళ్లాడు. రైలు కదలడంతో భర్త రాలేదని అనూష ఆత్రుతగా రైల్లో నుంచి దిగడానికి ప్రయత్నించింది. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయపడింది. రైల్వే పోలీసులు వెంటనే దంపతులను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యసేవల బంద్.. రోగుల అవస్థలు

యాడికి, సెప్టెంబరు 18: జీఓ నెంబరు 85కు వ్యతిరేకంగా ప్రభుత్వ వైద్యులు విధులు బహిష్కరించడంతో వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలలకు వస్తున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలకేంద్రంతో పాటు రాయలచెరువులో గల ప్రభుత్వ వైద్యశాలల్లో బుధవారం చికిత్స కోసం వచ్చిన ఓపీ రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ ఆస్పత్రుల్లో నలుగురు డాక్టర్లు పనిచేస్తున్నారు. కాగా జీఓ 85కు నిరసనగా ప్రభుత్వ వైద్యులు విధులను బహిష్కరించారు. ఫలితంగా ఓపీరోగులకు చికిత్స అందించడం లేదు. దీంతో ఎంఎల్‌హెచ్‌పీలు ఓపీ రోగులకు చికిత్స చేసి పంపుతున్నారు. యాడికిలో ఎంఎల్‌హెచ్‌పీలు అందించే వైద్యం నమ్మకం కుదరక కొందరు రోగులు వెనక్కి వెళ్లిపోవడం కనిపించింది. డాక్టర్లు విధుల బహిష్కరణలో ఉన్నారంట, ఇక్కడ వైద్యం దొరకకపోతే ఏమిచేస్తాం, ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్లి వైద్యం చేయించుకుంటామని తెలిపారు. విధుల బహిష్కరణపై వైద్యసిబ్బందిని ఆరా తీయగా జీవో 85కు వ్యతిరేకంగా డాక్టర్లు విధులు బహిష్కరించారని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ఓపీ రోగులకు చికిత్స అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని రోగులకు వైద్యసేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



యాడికి ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన పేషెంట్లు



పేషెంట్‌కు చికిత్స అందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ